క్లుప్తంగా

ఆకట్టుకున్న అన్నమాచార్య కీర్తనలు



అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న శ్రీవారి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ధర్మ ప్రచార వారోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. దేవస్థాన ప్రాంగణంలో విజయనగరం పట్టణానికి చెందిన శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఎం. భీష్మారావు బృందం సోమవారం ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. కీర్తనలు ఆలపించిన గాయనీ, గాయకులకు దేవస్థానం తరఫున ధర్మ పథం సర్టిఫికెట్లు దేవస్థాన అధికారులు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు, దేవస్థాన సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన



గర్భిణులను భోజనాలు అందజేస్తున్న వైద్యాధికారి భాగ్యరేఖ

పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ భాగ్యరేఖ ఆధ్వర్యంలో సిబ్బంది సుమారు 120 మంది రోగులను పరీక్షించారు. శిబిరానికి హాజరైన గర్భిణులకు సాయిట్రస్ట్ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రమణమ్మ, ఆర్‌పీ రమణ, ట్రస్ట్ సభ్యులు బలబద్రుని రామారావు, గంపా ఉషా, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా



ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్ల తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మికులకు బకాయి ఉన్న జీతాలను తక్షణమే చెల్లించాలన్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఆస్పత్రులను శుభ్రం చేస్తున్నా, తగిన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బుగత ఆశోక్, రంగరాజు, గౌరినాయుడు, సన్నిబాబు, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు, చెరువులను గుర్తించాలి

నెల్లిమర్ల: గ్రామాల్లో గల ప్రభుత్వ భూములు, చెరువుల విస్తీర్ణాన్ని గుర్తించి రికార్డుల్లో నమోదు చేయాలని తహసీల్దార్ ధర్మరాజు అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వీఆర్వోలు రీసర్వేలో గుర్తించిన ప్రభుత్వ భూములు, చెరువుల విస్తీర్ణం వివరాలు ఆయా రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. అలాగే భూహక్కు పత్రాలు పంపిణీ చేసి ఈకేవైసీ చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ డి. శైలజ, ఆర్‌ఐ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

11,12 తేదీల్లో విద్యార్థులకు పోటీలు

నెల్లిమర్ల: జనాభా – విద్యపై స్థానిక డైట్ కళాశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతినాయుడు తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, జనాభా – విద్యపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8,9 తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయిలో జానపద, నృత్యం, నాటిక పోటీలు ఈనెల 11,12 తేదీల్లో డైట్ కళాశాలలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల ఎంఈఓలు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు డైట్ లెక్చరర్లు పి. రవికుమార్ (ఫోన్: 79893 50244), కె. సూర్యారావు(ఫోన్: 89199 85388)లను సంప్రదించాలన్నారు. జిల్లాస్థాయి విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు.

ఒకటో తేదీన జీతాలు చెల్లించాలి

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘ జిల్లా అధ్యక్షుడు ఇజ్జిరోతు రామునాయుడు, ప్రధాన కార్యదర్శి సత్తారు రమణ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్ 30 నాటికి పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, పీఆర్‌సీ అరియర్స్, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లిస్తామని జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి..



దెంకాడ: చొల్లంగిపేటలో రోగులకు మందులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, తహసీల్దార్, తదితరులు

దెంకాడ: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారని చొల్లంగిపేట సర్పంచ్ కోరాడ కనకరాజు అన్నారు. మండలంలోని చొల్లంగిపేటలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు బి. భవానీ, పీవీవీ యోగితాబాల, పీవీ అనూషా, ఎస్. నవీన్, తదితరులు 504 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఇందులో 131 మందికి కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా నేత్ర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, చొల్లంగిపేట, డి.కొల్లాం సర్పంచ్‌లు కోరాడ కనకరాజు, అట్టాడ శివ, ఎంపీటీసీ సభ్యుడు గుడివాడ కిరణ్, రామతీర్థం బోర్డు మెంబర్ చిట్టిరాజు, వైద్య, సచివాలయ అధికారులు, సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



దెంకాడ: చొల్లంగిపేట వైద్యశిబిరంలో పాల్గొన్న రోగులు

300 మందికి వైద్య పరీక్షలు



భోగాపురం: రోగులకు రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

భోగాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 300 మందికి వైద్య సేవలు అందించినట్లు పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిస్వామి తెలిపారు. రోగులకు రక్త పరీక్షలు నిర్వహించిన అనంతరం మందులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చింత బంగారాజు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, ఈఓపీఆర్‌డీ సురేష్, సీడీపీఓ ఎస్తేరురాణి, పంచాయతీ సెక్రటరీ రామకృష్ణనాయుడు, కొమ్మూరు సుభోషణరావు, సుందర హరీష్, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎన్‌జీ సుదర్శనాచార్య

- లీడ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుదర్శనాచార్య

విజయనగరం టౌన్: విద్యార్థుల్లో మానవతా విలువలు, లక్ష్య సాధన, భక్తికి సంబంధించిన నైతిక విలువలు పెంపొందించడమే లీడ్ ఇండియా లక్ష్యమని లీడ్ ఇండియా వ్యవస్థాపకుడు డాక్టర్ సుదర్శనాచార్య అన్నారు. సోమవారం స్థానిక కోట జంక్షన్ వద్దనున్న కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లీడ్ ఇండియా ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయనగరం సౌజన్యంతో జిల్లాలో 15 జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఆప్ బడో దేశ్‌కో బడావో (నీ అభివృద్ధే దేశాభివృద్ధి) కార్యక్రమంలో భాగంగా మూడు రోజులు శిక్షణ శిబిరాలు నిర్వహించామన్నారు. బుధవారం మధ్యాహ్నం రింగురోడ్డులో ఉన్న సుజాత కన్వెన్షన్ హాల్‌లో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపిక, తదితరులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఆడిటర్ దుర్గాబాలాజీ, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఉమాబాలాజీ, భోగరాజు సూర్యలక్ష్మి, విజయకుమార్, చంద్రశేఖర్, శ్రీకాంత్ వర్మ, శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను నిలువరించేందుకే ‘సాగర కవచం’



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ధర్మరాజు

- డీఎస్పీ గోవిందరావు

భోగాపురం: సముద్ర మార్గం గుండా వచ్చే ఉగ్రవాదులు, చొరబాటుదార్లను నిలువరించేందుకు సాగరకవచం కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని డీఎస్పీ ఆర్. గోవిందరావు తెలిపారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సాగరకవచం మాక్‌డ్రిల్‌పై సోమవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన రాష్ట్రంలో 970 కిలోమీటర్ల మేర సముద్రతీరం విస్తరించి ఉందన్నారు. గతంలో గుర్తు తెలియని వ్యక్తులు, ఉగ్రవాదులు సముద్రమార్గం గుండా మనదేశంలోకి ప్రవేశించడం వల్ల ఎన్నో ఇబ్బందులు పడ్డామన్నారు. ఈ నేపథ్యలంటే చొరబాటుదారులను నివారించేందుకు ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు చెప్పారు. ఎస్పీ ఎం. దీపిక ఆదేశాల మేరకు రెండు మండలాల్లోని 16 మత్స్యకార గ్రామాల్లో ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు బీవీ వెంకటేశ్వరరావు, వైకుంఠరావు, ఎస్సైలు కృష్ణమూర్తి, నారాయణరావు, బాలకృష్ణ, శ్రీనివాసరావు, రమేష్, ఏఎస్సైలు, 200 మంది సిబ్బంది పాల్గొన్నారు.

తీరప్రాంతంలో తనిఖీలు

పూసపాటిరేగ : మండలంలోని తీరప్రాంత గ్రామాలలో భోగాపురం ఎస్‌ఈబీ పోలీసులు సోమవారం రాత్రి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి సముద్ర మార్గం గుండా సారా తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేపట్టినట్లు ఎస్‌ఈబీ ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఆయనతో పాటు సిబ్బంది ఉన్నారు.



తీరంలో బోటును తనిఖీ చేస్తున్న ఎస్‌ఈబీ పోలీసులు

ఘనంగా వినాయక నిమజ్జనం

విజయనగరం టౌన్:

పట్టణంలోని 25వ వార్డు రంగాలవీధిలో కొలువైన గణనాథుడిని సోమవారం రాత్రి ఘనంగా ఊరేగించి, నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయగా.. దశావతారం సెట్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



చూపరులను ఆకట్టుకున్న దశవతారం సీన్

సేవలందించడంలో జాప్యం వద్దు

మెంటాడ(గజపతినగరం రూరల్): సచివాలయాల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంలో జాప్యం వహించొద్దని ఎంపీడీఓ కిశోర్‌కుమార్ సూచించారు. వివిధ శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులతో సోమవారం తన ఛాంబర్‌లో సమావేశమై పలు సూచనలు చేశారు. అర్హులకు పథకాలు అందేలా చూడాలన్నారు. విద్యాశాఖ పనితీరు మెరుగుపడేలా చూడాలని ఎంఈఓ విమల కుమారికి సూచించారు. ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు పనులు ఎంతవరకు వచ్చాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిని ఆరా తీశారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో పంచాయతీ విస్తరణాధికారి జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

సిరిమాను చెట్టుకు ప్రత్యేక పూజలు



సిరిమాను చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల: ఉత్తరాంధ్రుల కల్పవల్లి పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలోని తుమ్మి అప్పారావు వారి కల్లాల్లో గుర్తించిన సిరిమాను చెట్టును సోమవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

జనరల్ బోగీలు పెంచాలి



రైల్వే స్టేషన్ మేనేజర్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: ఎక్స్‌ప్రెస్ రైల్లో జనరల్ బోగీలు పెంచాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.వాసు కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం స్థానిక రైల్వే స్టేషన్ కార్యాలయంలో మేనేజర్‌కి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జి. నిఖిల్, నవీన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని 11 కేవీ ఫీడర్స్‌కు సంబంధించి మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ హరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు బలిజవీధి, పుచ్చలవీధి, నల్లవీధి, ఆశపువీధి, ఫైర్ ఆఫీస్, ఉల్లివీధి, మేదరవీధి, పాత బస్టాండ్, కంటుభుక్తవీధి, సిటిబస్టాండ్, పీడబ్ల్యూ మార్కెట్, కోళ్లబజార్, చేపల మార్కెట్, ఎంజీ రోడ్, రామానాయుడు రోడ్, కన్యాకాపరమేశ్వరి కోవెల దగ్గర, మంగలవీధి, పెద్దవీధి, బాసినవీధి, రంగాలవీధి, పీవీజీ కాలనీ, గాడిఖానా, సీఎంఆర్ జంక్షన్, నెయ్యిల వీధి, మంచుకొండవారి వీధి, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం సీసాల స్వాధీనం

కొత్తవలస: మండలంలోని పాతసుంకరపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) ఎస్సై పి.నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం తనిఖీలు చేపట్టారు. గ్రామానికి చెందిన పెదిరెడ్ల గంగరాజు మద్యం అమ్ముతుండగా పట్టుకొని ఆయన వద్ద 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

17న ద్విచక్ర వాహనం వేలం

వేపాడ: వల్లంపూడి పోలీసు స్టేషన్‌లో ఉన్న ద్విచక్ర వాహనాన్ని(ఏపీ 31 బీజే 6389, ఆరెంజ్ కలర్ పల్సర్) ఈ నెల 17న ఎస్.కోట పోలీస్ సర్కిల్ కార్యాలయం వద్ద వేలం వేయనున్నట్లు వల్లంపూడి ఎస్సై రాజేష్ సోమవారం తెలిపారు. రూ.10 వేల నుంచి వేలం ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొని వాహనాన్ని సొంతం చేసుకోవాలని కోరారు.

రాములోరి పవిత్రోత్సవాలకు అంకురార్పణ



పవిత్రోత్సవాలకు అంకురార్పణ జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థానంలో రామచంద్ర స్వామి పవిత్రోత్సవాలకు ఆలయ అర్చకులు సోమవారం అంకురార్పణ నిర్వహించారు. స్వామికి ప్రాతః కాలార్చన పూజలనంతరం యాగశాలలో విశేష హోమాలు చేపట్టి వెండి మంటపం వద్ద సీతారాముల కల్యాణం వేడుకగా జరిపించారు. సాయంత్రం ఆశీర్వచన మంటపంలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం కార్యక్రమాలను వైఖానస ఆగమోక్తంగా జరిపించి పవిత్రోత్సవాలను ప్రారంభించారు. అర్చకులకు దేవస్థాన ఈఓ కిషోర్‌కుమార్ దీక్షా వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 11 వరకు ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించి .. 12న శాంతి కల్యాణం, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యం

విజయనగరం టౌన్: విద్యార్థులకు ధ్యానంపై అవగాహన పెంపొందించడమే తమ లక్ష్యమని ఆనందో బ్రహ్మ యూత్ ట్రస్ట్ కన్వీనర్ తులసి తెలిపారు. జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్‌కే, గురుదత్తా డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు ధ్యానం వల్ల కలిగే లాభాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జ్ఞానం నేర్చుకోవడం వల్ల వ్యక్తిత్వ వికాసం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు లక్ష్మి, రత్నకుమారి, సూర్య, కవిత, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న ట్రస్ట్ సభ్యులు

రాష్ట్రస్థాయి పోటీలకు కాపుశంబాం విద్యార్థులు



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ



చీపురుపల్లి: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం



వేపాడ: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీడీ

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం కాపుశంబాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు లెంక రోష్మిత, చింతా మేఘన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 7న విజయనగరం రాజీవ్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్–19 కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఈనెల 22న జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను హెచ్‌ఎం డి.రాము, పీడీ ఎం.ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది సోమవారం అభినందించారు.

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీనివాస జూనియర్ కళాశాల విద్యార్థులు బూర్లె సుభద్ర, పిల్ల ఉష అండర్–19 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, డైరెక్టర్ మూర్తి, అధ్యాపకులు అభినందించారు.

వేపాడ: మండలంలో బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆర్.ఈశ్వరరావు తెలిపారు. అండర్–19 విభాగంలో కోకో పోటీకి గండి జ్యోత్స్నవి, కబడ్డీ పోటీకి నాడు లౌకిక, బాలుర విభాగంలో కబడ్డీ పోటీకి మద్దిల రంజిత్ ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ రమణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ధ్యాన సాధనపై శిక్షణ



ధ్యాన సాధనపై అవగాహన కల్పిస్తున్న ప్రజాపిత బ్రహ్మకుమారి రాజేశ్వరి

బొబ్బిలి: స్థానిక యోగా ధ్యాన కేంద్రంలో రెవెన్యూ సిబ్బందికి ధ్యాన సాధనపై సోమవారం శిక్షణ ఇచ్చారు. బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జ్ బి.కె.రాజేశ్వరి మాట్లాడుతూ ధ్యానంతో ఒత్తిడిని జయించవచ్చన్నారు. ప్రతిఒక్కరూ ఒత్తిడికి దూరంగా ఉండి, మానసిక ప్రశాంతత కలిగి ఉండాలన్నారు. అప్పుడే ఆయుష్షు కాలం పెరుగుతుందన్నారు. ఏయే ధ్యానాలు అవలంబిస్తే ఒత్తిడి జయించి, మానసికంగా ప్రశాంతంగా ఉండగలమో తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు డోల రాజేశ్వరరావు, డీటీలు బలివాడ గౌరీ శంకరరావు, ఆర్.సాయికృష్ణ, ఆర్‌ఐ కల్యాణచక్రవర్తి, రీసర్వే డీటీ అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు లక్ష్మీపురం విద్యార్థులు

రేగిడి: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు మండలంలోని లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.సాయితేజ, ఎం.మణికంఠ ఎంపికైనట్లు పీడీలు జె.హైమావతి, సూరపునాయుడు తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి జరగబోయే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థులను ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య, సర్పంచ్ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం ఎన్.కృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

పశువ్యాధులపై అప్రమత్తం చేయాలి

సంతకవిటి: పశువ్యాధులపై రైతులను అప్రమత్తం చేయాలని మండల పశుసంవర్ధక శాఖ ఏడీ సి.హెచ్.తిరుపతిరావు సూచించారు. సోమవారం స్థానిక పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో గోపాలమిత్రలతో సమావేశమైన ఆయన గ్రామాల్లోని రైతులకు సకాలంలో పశువైద్య సేవలు అందించాలని తెలిపారు. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులు, వాటి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.